
ప్రజాశక్తి

ఆదివారం 8 జూన్ 2025 5 విజయనగరం




ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల అయ్యాయి. జిల్లాల్లో మొదటి ఏడాది ఇంటర్ విద్యార్థులు 5488 మంది పరీక్ష రాయగా వారిలో 2237 మంది ఉత్తీర్ణులయ్యారు. 45 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ ఇంటర్మీడియట్‌లో 4202 మంది పరీక్ష రాయగా వారిలో 2499 మంది ఉత్తీర్ణులై, 59 శాతం ఫలితాలు సాధించారు. ఒకేషనల్ విద్యార్థులు మొదటి సంవత్సరం 931 మందికి 524 మంది ఉత్తీర్ణులై, 56 శాతం నమోదు చేశారు. ద్వితీయ ఇంటర్‌లో 1089 మందికి 759 మంది ఉత్తీర్ణులై 70 శాతం ఫలితాలు సాధించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ పద్ధతిలోనే బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్‌చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శనివారం డిఇఒ కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ చేస్తామని చెప్పడం ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. ఈ నేపథ్యంలో వెబ్ కౌన్సిలింగ్ ను బహిష్కరిస్తున్నామని తెలిపారు.



డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సిలింగ్‌పై ఉపాధ్యాయుల ఆగ్రహం

- డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన
- ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి : ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక
- బదిలీల ప్రక్రియలో దొర్లిన అసంబద్ధాలను సవరించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెబ్ కౌన్సిలింగ్‌కు వ్యతిరేకంగా, మాన్యువల్ పద్ధతిలోనే బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మే 19, 20తేదీల్లో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించారని తెలిపారు.కానీ వెబ్ఆప్షన్లు పెట్టుకోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేయడమంటే హామీని ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటి వరకు జరిగిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడం వలన చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారని తెలిపారు. వీరందరికీ న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలను మొదట ఆప్షన్లో చూపించి తర్వాత బదిలీ ఉత్తర్వులు జనరేట్ చేసే ముందు సదరు ఖాళీలను తొలగించడంతో చాలా మంది సుదూర ప్రాంతాలకు బదిలీ కావలసి వచ్చిందన్నారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్స్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ వెబ్ సైట్లో తప్పనిసరి బదిలీగా చూపడంతో వారు బదిలీలకు ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారని తెలిపారు. తుది సీనియారిటీ జాబితాలు విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్స్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కొరకు ఎంపిక చేసుకున్నప్పటికి వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించడం సరైనది కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రమేష్ చంద్ర పట్నాయక్, డి.రాము, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, జి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మీడియా ఇంచార్జ్ బంకపల్లి శివప్రసాద్, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, జోగారావు, సూరిబాబు, ఎ పిటిఎఫ్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, ఆపస్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు, డిపిఆర్‌టియు నాయకులు పి.శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ 257 నాయకులు పి.శ్రీనివాస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒ మీసాల వెంకటరావుకు వినతి అందజేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు డిఇఒ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు పి.రాంప్రసాద్, యం.చంద్రరావు, వి.హరీష్, బిబియల్ మాధవిలత., యన్ ధనుంజయరావు, జె.వెంకటరావు, పిఆర్‌టియు నాయకులు ఐ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ఉపాధ్యాయ బదిలీలో ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బొబ్బిలి ఎంఆర్‌సి వద్ద నిరసన చేపట్టారు. వెబ్ ఆప్షన్స్ విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విజయగౌరి, శ్రీనివాస్, రామారావు, సుధాకర్, మహేష్, రాము పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలో ఎంఆర్‌సి వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంఇఒకి వినతి పత్రాన్ని అందజేశారు.

రామభద్రపురం : ఎస్‌జిటిలకు మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సి వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం ఎంఇఒ తిరుమల ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

భోగాపురం : ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు శనివారం నిరసన చేపట్టారు. అనంతరం ఎంఇఒలకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన స్థానిక ఎంఆర్‌సి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంఇఒకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు పతివాడ త్రినాధ్, ఒంత్రు శ్రీనివాస్, కెఎస్‌జె మోహన్ పాల్గొన్నారు.

గుర్ల: ఉపాధ్యాయులు బదిలీలకు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ ను బహిష్కరిస్తున్నట్లు మండల ఐక్య ఉపాధ్యాయ వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పుతుందని, ఉపాధ్యాయులు వెబ్ కౌన్సిలింగ్‌లో పాల్గొనడం లేదని ఐక్యవేదిక వెల్లడించింది.

పూసపాటిరేగ : ఎస్‌జిటిలకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని మండలంలోని ఉపాధ్యాయులు స్థానిక ఎంఆర్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





దత్తిరాజేరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు, ఉపాధ్యాయులు ; బొబ్బిలిలో వినతి అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు, ఉపాధ్యాయులు

నియోజకవర్గ స్థాయిలో

విజన్ ప్లాన్ కార్యాలయాలు


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విజన్ ప్లాన్ అమలు కమిటీలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ వారీగా రూపొందించిన విజన్ ప్లాన్(దార్శనిక పత్రం) అమలుకోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యాలయాలను ఈ నెల 9న ప్రారంభించనున్నట్టు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. నియోజకవర్గ కేంద్ర ఎంపిడిఒ కార్యాలయంలో విజన్ ప్లాన్ అమలు కార్యాలయాలు ఏర్పాటవుతాయని, ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు అధ్యక్షులుగా, నియోజకవర్గంలోని ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు సభ్యులుగా వుంటారని, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉపాధ్యక్షుడుగా, నియోజకవర్గ కేంద్ర ఎంపిడిఒ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యాలయాల ద్వారా ఆయా నియోజకవర్గాల విజన్ ప్లాన్ కార్యాచరణ అమలును పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యాలయంలో పనిచేసేందుకు ఐదుగురు సిబ్బందిని ఇప్పటికే కేటాయించామని, నియోజకవర్గ వారీగా రూపొందించిన విజన్ ప్లాన్‌లను ఆయా నియోజకవర్గ అధికారులకు అందజేస్తామన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ అనంతరం ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి నేరుగా నియోజకవర్గ విజన్ ప్లాన్ అమలుపై నియమితులైన కమిటీలతో ఆన్ లైన్ ద్వారా ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు.

11న జిల్లా వ్యాప్తంగా భారీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జూన్ 11న జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.105 కోట్ల విలువైన 416 పనులను ప్రారంభించేందుకు, శంకుస్థాపనలు చేసేందుకు గుర్తించామని చెప్పారు. రాజాంలో 29, బొబ్బిలిలో 31, చీపురుపల్లిలో 151, గజపతినగరంలో 47, నెల్లిమర్లలో 43, ఎస్.కోటలో 44, విజయనగరంలో 46 చొప్పున పనులను సిద్ధం చేయడం జరిగిందని, ఆయా శాసనసభ్యులతో సమన్వయం చేసుకొని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల జిల్లా అదికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటులో చంద్రబాబు కృషి

- రెండు లక్షల ఎకరాల భూమిని సేకరించి పరిశ్రమలు ఏర్పాటు
- శరవేగంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు : ఎమ్‌పి కలిశెట్టి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విశాఖపట్నంకు రైల్వే జోన్ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే వచ్చిందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాయని, ప్రత్యేక అధికారిని నియమించారని తెలిపారు.తాజాగా జనరల్ మేనేజర్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ రైల్వే జోన్ రావడం వల్ల ఉద్యోగ అవకాశాలు ,ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2 లక్షల ఎకరాల భూమిని సేకరించాలని, పరిశ్రమలు ఏర్పాటుకు కషి చేస్తున్నారన్నారు.విశాఖపట్నం విజయనగరం, అల్లూ రి సీతారామరాజు, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాలు భూమిని సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేస్తూన్నారన్నారు.ఉత్తరాంధ్ర జిల్లాలో ఏయే ప్రాంతాల్లో పరిశ్రమలకు అనుగుణంగా ఉన్నాయో గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆర్థిక రాజధాని అయిన విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారన్నారు. ఈనెల 9న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా సమస్యలపై మంత్రిని కలిసి విన్నవిస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతోందని, శాంతి భద్రతలు లేవని అంటున్నారని, గత ఐదేళ్ల లో లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉందో తెలుసుకోవాలన్నారు. ఆర్థిక ఇబ్బందుకు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేసారని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు శరవేగంగా రుగుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, విజయనగరం ఎఎంసిచైర్మన్ కర్రోతు వెంకట నరసింగ రావు పాల్గొన్నారు.

సచివాలయంలో ఉద్యోగాల పేరుతో బురిడీ

- ఏడుగురి నుంచి రూ.53 లక్షలు వసూళ్లు
- ఫోన్ స్టేటస్ ఆధారంగా ఉద్యోగాలకు ఎర
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మీరెప్పుడైనా రాష్ట్ర సచివాలయంలో అడుగుపెట్టారా..? పోనీ అక్కడ ఉద్యోగం వస్తే వద్దంటారా..? ఫోన్ స్టేటస్ ద్వారా ఇలాంటి ఆశలన్నీ కల్పించి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారి నుంచి ఏకంగా రూ.53 లక్షలు వసూలు చేసి, బురిడీ కొట్టించిన ముఠాను విజయనగరం వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్ అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి శనివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు.

విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు చెందిన నిందితుడు కె.సాయి వెంకట్ సుజిత్.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఆసక్తి ఉన్న వారు సంప్రదించాలని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దానిని చూసిన ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఏడుగురు యువకులు సుజిత్‌ను సంప్రదించారు. ఎపి సెక్రటేరియట్‌లో పలు ప్రభుత్వ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు వేయిస్తానని చెప్పి, వారి నుంచి రూ.53 లక్షలు వసూలు చేశాడు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సృష్టించి వారికి అందించారు. ఏడుగురు బాధితులను విజయవాడ తీసుకెళ్లి, అక్కడే కొన్ని రోజులు ఉంచారు. తొందర్లోనే మీకు సమాచారం ఇస్తామని చెప్పి అక్కడి నుంచి వారిని పంపించేశారు. ఎంతకీ ఎలాంటి సమాచారమూ రాకపోవడంతో బాధితుల్లో ఒకరైన శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఎస్.వినోద్.. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. సిఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. వినోద్ ఫిర్యాదుతో పోలీసులు తీగ లాగితే, డొంకంతా కదిలింది. నిందితుల్లో ఐదుగురు ఆంధ్రప్రదేశ్ వాసులు, నలుగురు హైదరాబాద్‌కు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదైందనే విషయం తెలిసిన వెంటనే నిందితులు పరారయ్యారు.

మాటు వేసి పట్టుకుని..

ముఠాలో ప్రధాన నిందితుడు సాయి వెంకట్ సుజిత్‌కు ఆరోగ్యం బాగోలేదని చూసేందుకు మిగతా నిందితులు.. విజయనగరంలోని చెల్లూరుకు చెందిన చెక్క మహేష్, జంగారెడ్డి గూడేనికి చెందిన రూబిన్, ఏలూరుకు చెందిన జాన్, యాకుబ్ వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మాటువేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నేరం చేసినట్లు అంగీకరించారు. హైదరాబాద్‌లో నకిలీ ఐడి కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారు చేసినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు సుజిత్ కోలుకోగానే అరెస్టు చేస్తామని, పరారీలో ఉన్న మిగిలిన నలుగురు నిందితులనూ త్వరలో పట్టుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. రూ.6 లక్షలు రికవరీ చేసినట్లు చెప్పారు. కేసు ఛేదించిన సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

మెడికల్ కళాశాలలో పిజి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో వైద్యుల సేవలను దృష్టిలో ఉంచుకొని దేశంలోనే తొలిసారిగా వారి వృత్తిపరమైన లైసెన్సు పునరుద్ధరణ, పునః రిజిస్ట్రేషన్లు, ఎన్ఒసిలు మొదలైన అన్ని రకాల వైద్య రిజిస్ట్రేషన్లను అందుబాటులో తీసుకువచ్చే సేవలను శనివారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ఐఎంఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ జె.సి.నాయుడు, డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కె.వి.మురళీమోహన్, డాక్టర్ మంచు కుమారస్వామి, తూర్పాటి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్లకు హోదా మార్పు


ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆరోగ్య శాఖలో సుదీర్ఘ కాలం పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ సేవలందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హోదాతో కూడిన పేరు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా విజయనగరం హెల్త్ ఎడ్యుకేటర్ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ డి.వి గిరిబాబు , ట్రెజరర్ ఎం.చాముండేశ్వరి, కె.ఎర్రన్న , ఆర్.రాంతులసి, బివివి అప్పారావు తదితరులు డిఎంహెచ్ఒ జీవనరాణికి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆడలేక మద్దెల ఓడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నాట్యం చేయడం చేతకాని ఓ నృత్యకళాకారుడు మద్దెల సరిగా వాయించలేదన్నాడట. అచ్చంగా అలాగే ఉంది జిల్లాలో ప్రజాప్రతినిధులు, టిడిపి వీరాభిమానుల తీరు. ఏడాదిలో జిల్లాకు చేసిందేమిటిరా బాబూ... అని జనం మొత్తుకుంటుంటే గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని, జిల్లాను వెనక్కి నెట్టేశారని చెబుతున్నారు. అందుకే కదా వారందర్ని చిత్తుచిత్తుగా ఓడించి, టిడిపి, జనసేన కూటమిని సింహాసనంపై కూర్చొండబెట్టింది. ఈ రెండు పార్టీల నాయకులు జగన్ ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన చేస్తామని చెప్పారు అప్పుడు ప్రతిపక్షంలో ఉంటే మాత్రం.. రాష్ట్రం ఎంతమేర అప్పుల్లో ఉంటే ఆ మాత్రం తెలియకుండా హామీలు ఇచ్చారా? అన్నది జనం మాట. మిగులు బడ్జెట్‌లో ఎవరైనా నడిపిస్తారు. అందులోనూ సంపద సృష్టిస్తానన్నాడు చంద్రబాబు, ఇప్పుడేమో అప్పులు పుట్టడం లేదంటున్నారు. వీటికి సమాధానం చెప్పాల్సిన ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రి వర్యులు శ్రీనివాసరావు, సంధ్యారాణి కలిసి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా రోటీన్ డైలాగులతో గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. నిజమే గత పాలకులేమీ తక్కువ తినలేదు. కానీ, గతం కన్నా మెరుగైన పాలన అందిస్తామని చెప్పింది టిడిపియే కదా? మరి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలైందా? ఎందుకు అమలు చేయలేక పోతున్నారు? ఏడాదిలో అమలు చేసిందేమిటి? అన్నది పరిశీలిస్తే అరకొరే. ఔను...! ఉన్నమాట చెప్పుకోవాలి. పింఛను రూ.3వేల నుంచి 4వేలకు పెంచడంతోపాటు మూడు నెలల బకాయి కూడా చెల్లించారు. ఏడాదికి మూడు సిలెండర్ల పథకం అమల్లోకి వచ్చింది. కానీ, ముందుగా డబ్బులు చెల్లించాలనే మెలిక పెట్టడం, ఆ తరువాత ఆ డబ్బులు తిరిగి కొంతమందికే రియింబర్స్‌మెంట్



కావడంతో ఈ పథకం చాలా మందికి రుచించడం లేదు. మరి రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20వేల పెట్టుబడి సాయం ఎందుకు అమలు కాలేదు. గత ఏడాది ఖరీఫ్‌లో ఎలాగూ ఇవ్వలేదు. మరోవైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. ఇప్పటి ఆదిశగా ప్రయత్నాలు లేవు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. మరోవైపు గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి స్థానంలో తల్లికి వందనం కింద రూ.15వేల చెల్లిస్తామని చెప్పారు. దీన్ని ఈ ఏడాది అమలు చేస్తామని చెప్తున్నప్పటికీ గత ఏడాది బకాయి కోసం మాట్లాడడం లేదు. నిరుద్యోగులకు రూ.3వేలు నష్టపరిహారం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కోసం మాట్లాడడం లేదు. ఇక జిల్లా విషయానికి వస్తే గడిచిన రెండు బడ్జెట్లలోనూ సాగునీటి వనరుల అభివృద్ధికి గత ప్రభుత్వం కన్నా ఎక్కువ బడ్జెట్ ఏమీ ఇచ్చేయలేదు. హడావుడి మాత్రం అంతా ఇంతా చేయలేదు. ఇటీవల ఏకంగా ఇరిగేషన్ శాఖ మంత్రి వచ్చి రామతీర్థసాగర్ పూర్తిచేస్తామని చెప్పారే తప్ప, నిధుల గుర్తించి మాట్లాడితే నోరెళ్లబెట్టారు. తోటపల్లి మిగులు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చంద్రంగా ఉంది. ఎంఎస్ఎంఇ పార్కుల పేరుతో భూముల సేకరణ మినహా ఏడాదిలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఇంకా చెప్పాలంటే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ, కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ సహా పలు ఫెర్రోఎల్లాయిూస్, జ్యూట్ పరిశ్రమలు మూత పడ్డాయి. ఏడాదిగా పర్యాటకాభివృద్ధి అనడమే తప్ప, ఆచరణలో ఇప్పటి వరకు కనిపించలేదు. సరే... ఇంకా అమూత్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీ చెప్తున్నట్టు ఇంకా గడిచిన ప్రభుత్వం మిగిల్చిన నష్టాల నుంచి గట్టెక్కుతున్నారే అనుకుందాం. అలాంటప్పుడు గత పాలకులపై ఏడుపులెందుకు అంటూ జనం చర్చించుకుంటు న్నారు. అందుకే మంచి గతమున కొంచెమేనోయ్... మందగించక ముందుకడుగేయ్... అన్న గురజాడ స్ఫూర్తిని ఎందుకు తీసుకోకూడదన్నదని జనం ప్రశ్న.

కొత్త పద్ధతులు అవలంభించాలి

రైతులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచన

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

వ్యవసాయ సాగులో రైతులు కొత్త పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం గజపతినగరంలోని మార్కెట్ యార్డ్ లో విత్తనాలతో పాటు రాయితీ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ అధికారుల సూచనలతో డ్రోన్ ఏ విధంగా ఉపయోగించాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయశాఖ ఎడిఎ మహారాజన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పడాల అరుణ, ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, వ్యవసాయ శాఖ జెడి రామారావు, ఎఒ ధనలక్ష్మి పాల్గొన్నారు.



విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోటలో శనివారం సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన పంపిణీ చేశారు. పట్టణంలోని రావువారివీధికి చెందిన అంపోలు శరత్ కుమార్ కుమారుడు వైద్యం కోసం రూ.20 వేలు, బాడంగి మండలం గొల్లాదికి చెందిన బంటు వెంకటరమణకు మంజూరైన రూ.8 లక్షల చెక్కులను బేబినాయన అందించారు. పేదల వైద్యానికి సిఎం సహాయ నిధి ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.తవిటినాయుడు, బొత్స అప్పులు ఉన్నారు.

నేడు డిసిఎంఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం



జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డిసిఎంఎస్) ఛైర్మన్ గా నియమితులైన గొంపకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నట్టు డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు నగరంలోని పోస్టాఫీస్ ఎదురుగా వున్న సంస్థ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న 13 బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు దక్కించుకున్నారని ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. విజయనగరం జిల్లాలో పదో తరగతిలో స్టూడెంట్స్ షైనింగ్ స్టార్ అవార్డులకు ఏడుగురు, మన్యం జిల్లాలో ఒకరు, ఇంటర్మీడియట్ విభాగంలో విజయనగరం జిల్లాలో ఇద్దరు, మన్యం జిల్లాలో ముగ్గురు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 9న పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, విజయనగరం జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి అనిత.. విద్యార్థులకు అవార్డులను అందజేయనున్నట్లు ప్రకటించారు.

గురుకులాల్లో సీట్లు ఖరారు చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వెంటనే సీట్లు ఖరారు చేసుకోవాలని గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందిన వారి ఎంపిక ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు.. రిజిస్టర్ మొబైల్‌కు మెసేజ్ వచ్చిన వెంటనే ఆయా పాఠశాలకు, కళాశాలకు వెళ్లి తమ సీట్లు ఖరారు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే వారికి అడ్మిషన్ ఉండదని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ఐదో తరగతిలో మిగిలిన సీట్లకు రెండో జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. చీపురుపల్లి గురుకుల కళాశాలలో ఐఐటి, నీట్‌కు ఎంపికైన బాలికలు కూడా వెంటనే సీట్లు ఖరారు చేసుకోవాలని సూచించారు.

వసతిగృహాలు తెరవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను వెంటనే తెరవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ డిమాండ్‌చేశారు. బొబ్బిలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వసతిగృహాలను మూసేటప్పుడు ముందడుగు, తెరిచేటప్పుడు వెనుకడుగు వేయడం అన్యాయమన్నారు. కళాశాలలు ప్రారంభించినా సరే ఇప్పటివరకు వసతిగృహాలను తెరవక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.



రామదాసుపేటలో అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే లోకం మాధవితో పాటు జనసేన నాయకులు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. తుడెం గ్రామంలో గ్యాస్ లీకై ఇల్లు దగ్ధమైన నేపథ్యంలో బాధితురాలికి ఎమ్మెల్యే రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సవరవల్లి పంచాయతీ రామదాసు పేటలో అగ్ని ప్రమాద బాధితులకు జనసేన నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి 10వేలు రూపాయలు, పార్టీ అధ్యక్షులు వందనాల రమణ నిత్యవసర సరుకులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎ.రావివలస పంచాయతీ కొయ్యవానిపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కాలపురెడ్డి సూర్యనారాయణ భార్య రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆమెను ఎమ్మెల్యే పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మట్ట అయ్యప్పరెడ్డి, పడాల శ్రీనివాసరావు, వందనాల రమణ, చెల్లిబోయిన రాము, కర్రోతు శ్రీనివాసరావు, లక్ష్మణ, దల్లి శ్రీను, టిడిపి నాయకులు పూడి రమణ, రీసు రమణ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కి 466 మార్కులు

ప్రజాశక్తి-కొత్తవలస

ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో వాగ్దేవి కళాశాల విద్యార్థి జి.లోకేష్ ఎంపిసిలో 466 మార్కులు సాధించాడు. ఎం.పవన్ 464, పి.కార్తీక్ 464, జి.సోమశేఖర్ 454, ఎస్.అఖిల్ 454, బి.ప్రసాద్ 453 మార్కులు సాధించారు. 450పైగా 15 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. బైపిసిలో యోగిత 433 మార్కులు, భవ్య శ్రీ 431 మార్కులు సాధించారు. సిఇసిలో విజయ్ కుమార్ 470 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు, డైరెక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ ఎం.లక్ష్మణరావు, సతీష్ మాస్టారు అభినందించారు.

మూడు రోజులుగా అంధకారంలోనే..

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో కరకవలస పంచాయతీ పరిధిలో మారిక గిరిజన గ్రామానికి మూడు రోజులుగా విద్యుత్తు సౌకర్యం లేక చీకట్లోనే మగ్గుతున్నారు. గురువారం పడిన ఈదురుగాలులకు కొండపై ఉన్న చెట్లు విరిగి, విద్యుత్తు స్తంభాలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి విద్యుత్తు సరఫరాను అధికారులు పునరుద్ధరించలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు పి.వీర్రాజు, బాబూరావు వాపోయారు. వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

దెబ్బతిన్న నువ్వుపంట

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నువ్వుపంట దెబ్బతింది. పంట చేతికొచ్చిన సమయంలో నిత్యం వర్షం కురవడం, ఆ నీరు పొలాల నుంచి బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో నువ్వు చేనంతా కుళ్లిపోయింది. చామలా పల్లి, గుడివాడ, వల్లంపూడి, వేపాడ, జగ్గయ్యపేట గ్రామాల్లో రైతులు ఎక్కువగా వేసవిలో నువ్వు పంట సాగుచేశారు. వరుస వర్షాలతో వీరంతా పంట నష్టపోయారు.



కుళ్లిపోయిన నువ్వు చేను

మేం టైమ్‌కు రాం..!

- సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది
- లబ్ధిదారులకు తప్పని ఎదురు చూపులు
- పలు సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు దర్శనం
- తనిఖీలు నిర్వహించని అధికారులు

ప్రజాశక్తి - సంతకవిటి

ప్రజలకు మరింత దగ్గరగా సేవలందించేందుకు ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సిబ్బంది సకాలంలో రాకపోవడం.. వచ్చినా కుర్చీల్లో లేకపోవడంతో ప్రజలకు సక్రమంగా సేవలందడం లేదు. బదిలీల పేరుతో చాకులు చెబుతూ, మండలంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, సమయపాలన పాటించకుండా వారికి తీరిక సమయంలో వచ్చి ముఖం చూపించి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత వారం రోజుల వ్యవధిలో ప్రజాశక్తి మండలంలోని పలు సచివాలయాలను సందర్శించగా ఉద్యోగులు సమయం పాటించడం లేదని తేటతెల్లమైంది. మండల కేంద్రంలోని సచివాలయంలో సమయం మించుపోతున్నా సిబ్బంది మాత్రం రాలేదు. ఒకే ఒక్క ఉద్యోగి డిజిటల్ అసిస్టెంట్ వస్తున్నా మిగతా సిబ్బంది మాత్రం ఇక వారికి నచ్చిన టైమ్‌కి వస్తున్నారు. రేషన్ కార్డు కోసం వస్తున్న లబ్ధిదారులకు సిబ్బంది లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని పలువురు బహిరంగానే విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోనే టైమ్‌కి రావడం లేదంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చును.

కొండగూడెం సచివాలయంలో సిబ్బంది రాక కోసం ఎదురు చూపు

కొండగూడెం సచివాలయంలో సిబ్బంది రాక కోసం లబ్ధిదారులు ఎదురు చూశారు. సమయం మించిపోతున్నా రాకపోవడంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు. మండలంలోని చివరి గ్రామాలను అధికారులు పట్టించుకోకపోవడంతో సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడంలేదు. ఈ సచివాలయానికి సిబ్బంది కొరత ఉందని చేతులు దులుపుకుంటున్నారు.

తమరాం సచివాలయంలో సిబ్బంది ముగ్గురే

తమరాం సచివాలయంలో సిబ్బంది ముగ్గురు మాత్రమే విధుల్లో ఉంటారు. మరో ముగ్గురు ఇసుక రీచ్‌లో ఉంటారు. ప్రజలకు సంపూర్ణ సేవలు అందడం లేదని ప్రజలే చెబుతున్నారు. ఈ సచివాలయంలో సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

తలుపులు తెరవని మిర్తివలస సచివాలయం

సమయం మించిపోతున్నా మిర్తి వలస సచివాలయం తలుపులు మాత్రం తెరవలేదు. లబ్ధిదారులు రేషన్ కార్డులు కోసం సచివాలయం బయట వేసి చూస్తున్నారు. చివరికి ఓ లబ్ధిదారుడు పంచాయతీ సెక్రెటరీకి ఫోన్ చేస్తానని సచివాలయం బయట అంటించిన ఫోన్ నెంబర్ లిస్ట్ వద్దకు వెళ్లి, ఫోన్ చేశాడు. అయితే ఇక్కడ ముగ్గురు సిబ్బంది ఉండడంతో, ఓ ఉద్యోగిని జి.ఎన్.పురం సచివాలయంలో అదనపు బాధ్యతలు చేపడుతున్నారని మిగిలిన వారంతా వస్తారని పంచాయతీ కార్యదర్శి చెప్పినట్లు తెలిస్తోంది.



కొండగూడెంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



మిర్తివలసలో 10గంటల వరకు తెరుచుకోని సచివాలయం

మండలంలోని చాలా సచివాలయాల్లో ఉద్యోగులు అస్సలు ముమోంట్ రిజిస్టర్ ఉపయోగించడం లేదు. అధికారులు పలుమార్లు చెప్పినా గాలికి వదిలేస్తున్నారు. ముమోంట్ రిజిస్టర్ ఉన్న సచివాలయాలలో ఉద్యోగులు ఫీల్డ్ అని రాస్తున్నారు అంతే.. ఎక్కడికి వెళ్తున్నారో ఎవరికి తెలియదు. సచివాలయం కార్యాలయంలో మాత్రం ఒకిరద్దరు అధికారులు తప్ప మిగిలిన వారంతా ఫీల్డ్ అని చెప్పి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న ఉద్యోగుల కొరత

మండలంలోని చాలా సచివాలయాలల్లో ఉద్యోగులు కొరత ఎక్కువగా ఉంది. మరి కొంతమంది సెలవులు పేరుతో విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదని పలువురు బహిరంగగానే విమర్శిస్తున్నారు. ప్రజలు చెప్పులు అరిగేలా తిరుగుతే గాని పనులు జరగడంలేదు. అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే సచివాలయాల వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల అధికారులు ప్రతి సచివాలయం తనిఖీలు నిర్వహిస్తే, సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తారని ప్రజలు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

హిందూ ముస్లిముల మధ్య పెల్లుబికిన సోదర భావం



ప్రార్థన చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో బక్రీద్ పండగ శనివారం ఘనంగా జరిగింది.హిందూ-ముస్లిం సోదరుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, ఘర్షలు, అల్లర్లు జరగకుండా రంజాన్ ప్రశాంతయుతంగా ముగిసింది. జిల్లాలో బక్రీద్ పర్వదినాన జిల్లాలో మత ఘర్షణలు తలెత్తకుండా పోలీసుశాఖ ముందస్తు భద్రత చర్యలు చేపట్టింది. ఎస్‌పివకుల్‌జిందాల్ బక్రీద్ పండగను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు సిసి కెమెరాలు, డ్రోన్స్ తో పర్యవేక్షించారు. మసీదుల వద్ద ప్రార్థనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. నగరంలోని ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్ నిఘా ఏర్పాటు చేశారు. విజయనగరం, బొబ్బిలి డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యా రెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు.

బొబ్బిలి : పట్టణంలో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక షాదీఖానాలో ముస్లిములు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్ద అబ్దుల్ కలాం వివరించారు. ముస్లిములకు ఎమ్మెల్యే బేబినాయన, పట్టణ సిఐ సతీష్ కుమార్ బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు.

వికలాంగులకు అండగా ప్రభుత్వం

పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు క్రీడల్లో కల్పిస్తున్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర" రెండవ రోజు విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో 4 ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో 3 శాతం ఉద్యోగాలను ఎటువంటి రాత పరీక్ష లేకుండానే వారి విద్యార్హతను బట్టి పారా క్రీడలు ఆడే వికలాంగులకు కల్పిస్తున్నట్లు తెలిపారు. పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్‌లో పతకాలు సాధించే పారా క్రీడాకారులకు కోట్లాది రూపాయలు ప్రోత్సాహం అందజేస్తున్నామని అన్నారు. విశాఖపట్నంలో 22 ఎకరాల్లో పారా క్రీడాకారుల కోసం అత్యాధునిక స్టేడియం నిర్మించబోతున్నామని తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చు కునేందుకు రాష్ట్రములో వున్న వికలాంగులంతా పారా క్రీడలు ఆడేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో జరిగే ఈ కార్యక్రమానికి రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తోడ్పాటు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావుతో పాటు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, విశాఖపట్నం గౌరవ అధ్యక్షులు డాక్టర్. శీతల్ మదాన్, పారా నేషనల్ స్విమ్మర్ రవి కుమార్, పారా ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగా తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: సాంబరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాంబరాజు మృతి తీరనిలోటు : మంత్రి

గుర్ల : అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సాంబరాజు మృతి గుర్ల మండల తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కెల్ల గ్రామంలో సాంబరాజు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంత టిడిపి అభివృద్ధికి, వైభవానికి సాంబరాజు చేసిన సేవలు శ్లాఘనీయం అన్నారు. కాంగ్రెస్ కంచుకోట అయిన సతివాడ నియోజకవర్గంలో టిడిపి జెండా రెపరెప లాండించిన ఘనత సాంబరాజుకు దక్కుతోందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోశానిచ్చారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

వైద్య రంగంలో రోబోటిక్ శస్త్రచికిత్సలు

- తక్కువ నొప్పి..తక్కువ రక్తస్రావం
- రోగులు త్వరగా కోలుకునే అవకాశం
- నేడు అవగాహన సదస్సు : డాక్టర్ కె.తిరుమల ప్రసాద్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆధునిక వైద్యరంగంలో రోబోటిక్ శస్త్ర చికిత్సలు అనే అంశంపై తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ఈనెల 8న ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం తిరుమల మెడికవర్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు ను స్థానిక ఎమ్మెల్యే పుసపాటి అదితి జయలక్ష్మి గజపతి రాజు ప్రారంభిస్తారని తెలిపారు. ఎ.పి.మెడికల్ కౌన్సిల్, ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి.వి.ఎస్.ఎల్. నరసింహం (ఎంఎస్), జిఎస్ఎల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ జి.భాస్కర్‌రావు, ప్రభుత్వ మెడికల్ కాలేజిప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పల నాయుడు, డాక్టర్ వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ జె.సి. నాయుడు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మగన్ మెహాత్రా తదితరులు పాల్గొంటారని తెలిపారు. రోబోటిక్ సర్జరీ అనేది ఆధునిక శస్త్రచికిత్సా విధానమని, ఇందులో అధిక ఖచ్చితత్వం, నియంత్రణ, సౌకర్యం కలుగుతుందని వివరించారు. ఈవిధానంలో కంప్యూటర్ కంట్రోల్ ద్వారా రోబోటిక్ హ్యాండ్స్‌ను నియంత్రించి, శస్త్రచికిత్సా పరికరాలను ఉపయోగిస్తారని, దీనివల్ల తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెఇలపారు. వైద్య నిపుణులు, విద్యార్థులు, ప్రజానికం ఈ సదస్సు కు హాజరై ప్రయోజనాలను తెలుసుకోవాలని డాక్టర్ తిరుమల ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్.మల్లిఖార్జునరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.అఖిల్ పాల్గొన్నారు.



సుధీర్‌పాలిమర్స్ పరిశ్రమను ప్రారంభిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్యే బేబినాయన

అభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తలే కీలకం

గ్రోత్‌సెంటర్‌లో సుధీర్ పాలిమర్స్ ప్రారంభంలో కలెక్టర్

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లా అభివృద్ధి చెందాలంటే మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. శనివారం బొబ్బిలి గ్రోత్ సెంటర్లో సుధీర్ పాలిమర్స్ పరిశ్రమను ఎమ్మెల్యే బేబినాయనతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కొత్త తరహాలో పిఎంఇజిపి పథకం ద్వారా ప్లాస్టిక్ గ్రాన్యూల్ పరిశ్రమను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2024-25లో ఉత్తరాంధ్రలోనే ఇది మొదటి పరిశ్రమని చెప్పారు. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్‌సెంటర్లో కొత్త తరహా ప్లాస్టిక్ పరిశ్రమ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గ్రోత్‌సెంటర్‌లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, పరిశ్రమ నిర్వాహకురాలు ఆళ్ల జ్యోతి, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్షిప్‌కు 2024 సంబంధించి మండలంలోని పినతాడివాడ ఎపియుపి స్కూల్ ఇద్దరూ విద్యార్థులు జిల్లా స్థాయిలోఎంపికయ్యారు. జనరల్ కేటగిరీలో కోరనాన కుశల్ కుమార్ 141 మార్కులతో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, మొయిద లోహిత 127 మార్కులతో 26వ ర్యాంకును సాధించారు. ఈ విద్యార్థులను డిప్యూటీ డిఇఒ, మండల విద్యా శాఖాధికారులు కెవి రమణ, వై.శ్రీరాములు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రత్యేక కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనం 12 వేల రూపాయలు ఐదు సంవత్సరాల వరకూ అందుతోందన్నారు. 8వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పరిమిత ఆర్థిక వనరులు ఉన్న కుటుంబాలకు చెందిన వారికి ఈ స్కాలర్‌షిప్ అందిసారన్నారు. పాఠశాల హెచ్‌ఎం జి రాజశేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని అభినందనలు తెలిపారు.

సులభతరంగా పన్నులు వసూలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సులభతర రీతిలో రెవెన్యూ వసూళ్లను పెంచాలని సిబ్బందికి, అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలను త్వరితగతిన వసూలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఇంకా పన్ను విధించని ఖాళీ స్థలాలకు, పన్ను విధించాలని చెప్పారు. అనధికార కొళాయి కనెక్షన్లను గుర్తించి తక్షణమే తొలిగించాలని ఆదేశించారు. నీటి ఛార్జీలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు , కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

ఒత్తిడి తగ్గించేందుకు యోగా దోహదం

మానసిక ఒత్తిడిని తగ్గించి ఉల్లాసంగా ఉంచే చక్కటి ప్రక్రియ యోగా అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం దాసన్నపేట రైతు బజార్ వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరితో యోగాసనాలు వేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ పట్ల చైతన్యవంతులై ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విమానాశ్రయ పనుల్లో బీహార్ వాసి మృతి

ప్రజాశక్తి -భోగాపురం

విమానాశ్రయం లోపల జరుగుతున్న పనుల్లో ప్రమాదవశాత్తు మట్టిని లెవెల్ చేసే వాహనం కిందపడి బీహార్ వాసి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన అంకిత్ కుమార్ తివారి ఎల్ అండ్ టి సంస్థలో మట్టిని లెవెల్ చేసే వాహనానికి ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి మట్టిని సర్దుతున్న సమయంలో వాహనాన్ని ఆపాడు. హ్యాండ్ బ్రేక్ సరిగా పడకపోవడంతో పాటు రోడ్డు పల్లంగా ఉండడంతో వాహనం ముందుకు పోతోంది. దాన్ని ఆపే క్రమంలో కాలుజారి చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



మృతి చెందిన అంకిత్‌కుమార్